క్లుప్తంగా

ఘనంగా గొంతానమ్మ పండుగ



పాలసానిపల్లిలో ట్రాక్టర్‌పై నందీశ్వరునిని ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు: మండలంలోని పాలసానిపల్లిలోని విజయదశమి పురస్కరించుకుని గురువారం గొంతానమ్మ ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత గొంతానమ్మకు ప్రతి ఏటా వైభవంగా నవరాత్రుల పూజా కార్యక్రమాలను నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోందన్నారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని దసరా నాడు గ్రామస్తులు పెద్ద ఎత్తున నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యువకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున నందీశ్వరునిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయికి పూజలు

గణపవరం: మండలంలోని షిర్డిసాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయాలను రంగురంగుల విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. గణపవరంలో బొబ్బిలివంతెన దిగువున ఉన్న షిర్డిసాయిబాబా మందిరంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో హాజరై సాయిబాబాకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాబా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. పల్లకి ఉత్సవం నిర్వహించారు. సరిపల్లె, అర్ధవరం, పిప్పర, తదితర గ్రామాల్లో సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: రీసర్వేను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉంగుటూరు మండలంలో అధికారులు భూ రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. శుక్రవారం బాదంపూడి, గోపినాథపట్నం, చేబ్రోలులో నిర్వహించిన గ్రామ సభలో రీసర్వే తేదీలను రైతులకు వివరించారు. ఆయా తేదీలలో రైతులు అవసరమైన పత్రాలతో తప్పకుండా రీసర్వేకు హాజరు కావాలని తెలిపారు.

భవానీలకు భిక్ష



భవానీలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెంలో ప్రతిరోజు భవాని మాలదారులకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ భవాని మాలదారుడు కొండేటి బాబు అన్నదానం నిర్వహిస్తున్నారు. వ్యక్తిగతంగా ఆధ్యాత్మికంగా ప్రతి సంవత్సరం భవాని, అయ్యప్ప మాలదారులకు ప్రతిరోజు అన్నదానం నిర్వహించడం తృప్తినిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే వరవడిని కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు: మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా వట్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ పరిధిలోని వట్లూరు ఏపీఎఫ్ ఫీడర్, వట్లూరు గ్రామంలోను రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె ఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల తొలగింపు, లైన్ల మరమ్మతులు కారణంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రాచూరు, సీతారామపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: మండలంలోని నిడమర్రులో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీ నడమరు ఫీడరు పనులు నిమత్తం శనివారం ఉదయం 10గంటల నుంచి 1 గంటవరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు డి ఇ అంబేడ్కర్ తెలిపారు. నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ బాదంపూడి రూరల్ ఫీడరు, 11 కేవీ కైకరం ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రావులపర్రు, రాచూరు, సీతారామపురం గ్రామాలకు విద్యుత్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీఎంజేజేబీవై చెక్కు పంపిణీ

దెందులూరు: యూనియన్ బ్యాంకులో శుక్రవారం మేనేజర్ ప్రియదర్శిని ఎస్ఎస్‌టి ఆర్థిక అక్షరాస్య కేంద్రం కౌన్సిలర్లు పి శ్రీనివాసరావు, కె చందు, దోసపాడు గ్రామానికి చెందిన నాగమణికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. గ్రామంలో ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ రోడ్డులో నడవాలన్నా నరకమే!

- అడుగడుగునా గోతుల మయం.. ఆదమరిస్తే అంతే
- నిత్యం అవస్థలు పడుతున్న రైతులు, విద్యార్థులు, ప్రజలు

భీమడోలు: మండలంలోని సూరప్పగూడెం, పాతూరు గ్రామాల మధ్య రెండు జాతీయ రహదారులను కలుపుతూ– రైల్వే ట్రాక్ అనుకుని ఉన్న ఈ రోడ్డు వర్షాలకు ఛిద్రంగా మారింది. దీంతో భారీ గోతులతో ఈ రోడ్డుపై నడకే కష్టంగా ఉండడంతో ఇక ఆటోలు, ద్విచక్రవాహనాలు, భారీ వాహనాలు సైతం రెండు కిలోమీటర్ల మేర భయం భయంగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి తలెత్తింది. ఈ రోడ్డు ప్రయాణమంటేనే ఒళ్లు హూనమవాల్సిందే. ఈ కూటమి పాలనలో ఈ గోతులను పూడ్చకపోవడంతో ఈ రోడ్లు ప్రమాదకరమైన గోతులుగా మారాయి. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని సూరప్పగూడెం, పాతూరు గ్రామాలు రెండు జాతీయ రహదారుల మధ్య ఉన్నాయి. రెండు గ్రామాలను కలిపే జెడ్పీ లోని పీఐయు(ప్రంచాయతీరాజ్ ఇంప్లిమెంటిక్ యూనిట్) రోడ్డు పాతూరు రైల్వే ట్రాక్ మీదుగా రాకపోకలు సాగించాల్సిందే. అయితే ఈ రోడ్డు కొన్నేళ్లుగా అధ్వానంగా మారడంతో ఈ గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు రైల్వే గేటు మరమ్మతుల నేపథ్యంలో ప్రత్యామ్నయంగా ఈ రోడ్డు వెంబడి భారీ వాహనాలు ప్రయాణిస్తుండడంతో చిన్న గోతులు పెద్దగా మారి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. పలు గ్రామాల ప్రజలు భీమడోలు జంక్షన్‌కు వెళ్లాలంటే ఈ రహదారిని వినియోగిస్తున్నారు. గోతుల్లో ద్విచక్రవాహనాలు, సైకిళ్లు పడి గాయాలపాలవుతున్నారు. పాతూరులోని వ్యవసాయ భూములకు వెళ్లే రైతులు ఈ రోడ్డుపై పగలు, రాత్రి ప్రయాణిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు నరకానికి ఆనవాళ్లుగా మారింది. అదే విధంగా రోడ్డు వెంబడి పిచ్చి మొక్కలు గుబురుగా పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు ఈ రోడ్డు నిర్మాణానికి తగు నిధులు మంజూరు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పాతూరు నుంచి సూరప్పగూడెం వైపుగా గోతుల్లో వాహనాల రాకపోకలు



అధ్వానంగా ఉన్న సూరప్పగూడెం నుంచి పాతూరు వెళ్లే జెడ్పీ రోడ్డు

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

ఈ రహదారి వెంబడి నిత్యం రైతులు, విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా ప్రతి రోజు సూరప్పగూడెం నుంచి పాతూరుకు, పాతూరు నుంచి సూరప్పగూడెం గ్రామాలకు వెళ్తుంటారు. అయితే కొన్నేళ్లుగా ఈ రోడ్డుపై గోతులు ఏర్పడి ద్విచక్రవాహనదారులు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలతో పాటు భారీ వాహనాలు వెళ్తుండడంతో ఈ గోతులు మరింత పెద్దవిగా మారాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగింది. సంబంధిత అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టాలి.

– ఇంజేటి జూనియర్, ఎంపీటీసీ, సూరప్పగూడెం

రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలి



భీమడోలు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భీమడోలు: భీమడోలు గ్రామ పంచాయతీ వద్ద గురువారం జరిగిన గ్రామసభలో గ్రామంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని కోరుతూ కూటమి నాయకులు గ్రామ సర్పంచ్ పాము సునీతామాన్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల వద్ద గ్రామసభలు జరిగాయి. భీమడోలులో సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ అధ్యక్షతన జరిగి సభలో పలు శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అయితే బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పెరిగిపోతున్న కూరగాయాలు, ఇతర నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించేందుకు, గ్రామంలో రైతు బజారును ఏర్పాటు చేయాలని, దీని వల్ల సామాన్యులకు అందుబాటులోకి ధరలను తీసుకుని రావాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కేవీఎల్ తనూజ, ఏఎంసీ చైర్మన్ శేషగిరి, పెద్దలు యుగంధర్, కుక్కల ప్రసాద్, మద్దాల వెంకటరత్నం, డి.రమణ , వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల జీవితం ఆదర్శనీయం





గణపవరం వర్తకసంఘం వద్ద గాంధీ జయంతి వేడుకలు, నారాయణపురం హైస్కూలులో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గణపవరం: మనకోసం సర్వం ధారబోసిన త్యాగధనుల జీవితాన్ని మనం ఆదర్శంగా తీసుకుని వారి ఆశయసాధనకు పాటు పడాలని కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్‌రాజు అన్నారు. గురువారం గణపవరం వర్తక సంఘ భవనం వద్ద మహాత్మగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడిన పలువురు భారతదేశం అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ దేశ సౌభాగ్యంకోసం పనిచేయాలని పిలుపు ఇచ్చారు. ఈకార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు వంకాయలరామారావు, కార్యదర్శి నడింపల్లిరాంపండు, సహాయ కార్యదర్శి ఉప్పల నాగేశ్వరరావు, ఇతర కార్యవర్గసభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ప్రారంభం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొన్నాడ రవి ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తోట పోతురాజు మాట్లాడుతూ గాంధీజీ త్యాగాలను స్మరిస్తూ, గొప్పతనాన్ని కొనియాడారు. ముందుగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు సీతాల సత్యానారాయణ, అధ్యక్షుడే పునుముల రాంబాబు, కల్లపల్లి పోతురజు, రవి, రవీంద్రవర్మ, గంజి నాగమణి, తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ ఆఫీసు వద్ద సర్పంచ్ దిడ్ల అలకానంద గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని మండల అభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. పెదవేగి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులతో ఎంపీడీఓ రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ఇతర సాధారణ అంశాలు చర్చించి పరిష్కార మార్గాలను తెలియజేశారు.

నేడు పీఈటీ, పీడీలకు సమావేశం

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో శనివారం 2.30 గంటలకు 69వ ఎస్‌జీఎఫ్ దెందులూరు మండల స్పోర్ట్స్ గేమ్స్ ఎంపిక నిమిత్తం సమావేశం దెందులూరు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో జరుగుతుందని కొవ్వలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. మండలంలోని పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్లు అందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

రోగులు ఇబ్బంది పడకుండా సేవలు అందించాలి

భీమడోలు: వైద్యుల సమ్మె కారణంగా ఆసుపత్రుల్లో రోగులు ఇబ్బందులు పడకుండా వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా వైద్యాధికారి డా.పీజే అమృతం అన్నారు. పూళ్ల పీహెచ్‌సీని శుక్రవారం ఆమె ఆకస్మిక సందర్శన చేశారు. వైద్యుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నయంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ జి.శ్రీలక్ష్మీని నియమించి రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులకు సక్రమంగా సేవలు అందుతున్నదీ లేనిదీ ఆమె రోగుల నుంచి ఆరా తీసారు. ఆసుపత్రిలోని మందులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఆసుపత్రిలోని సిబ్బందికి పలు సూచనలందించారు. ఫ్రిజ్‌లో భద్రపర్చే కుక్క, పాము కాటు వ్యాక్సిన్‌లను ఆమె పరిశీలించారు. వైద్యుల సమ్మె వల్ల విధులు బహిష్కరించినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోను ఓపీ సేవలు పూర్తి అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పీహెచ్‌సీ పనితీరును ఆరోగ్య విస్తరణాధికారి వైపీ లక్ష్మణరావు నుంచి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పూళ్లలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యాధికారి డా. పీజే అమృతం

సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణే లక్ష్యం

గణపవరం: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనతోపాటు సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని గణపవరం సర్పంచ్ మూర అలంకారం పిలుపు ఇచ్చారు. శుక్రవారం గణపవరం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈసభలో అలంకారం మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా తమ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై గ్రామసభలో చర్చించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ తీరు, స్వామిత్వ, ఇతర అంశాలపై సభలో చర్చించారు. ఈసభలో డిప్యూటి ఎంపీడీవో సత్యానారాయణ, తోట శ్రీను, గణపవరం సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి డి.శివరామ్‌ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ అలంకారం

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భీమడోలు: మండల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి. గుండుగొలను, పూళ్ల, భీమడోలు, కురెళ్లగూడెం, నరెడ్లగూడెం, అన్నేవారిగూడెం, ఎంఎంపురం తదితర గ్రామాల్లో పలు ఆలయాల్లో రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో 11వ రోజైన గురువారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి లంకా శివకుమార్ శర్మ, శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని భవానమ్మ అమ్మవారిని, అన్నేవారిగూడెం గ్రామాల్లో కొలువైన అమ్మవార్లను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవాలు వాడవాడలా శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమడోలులోని రావిచెట్టు వారి వీధిలోని అమ్మవారిని ఓ ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దాయం సుజాత, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

పెదపాడు: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాజుపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. సింగిల్ ట్రస్టీ, అర్చకులు గూడూరి రామలింగేశ్వరరావు ఆయన కుమారుడు రవికుమార్‌లు విశేష పూజలు జరిపారు. రాజుపేట పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెదపాడు గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోను, బళ్లరేవుతూము సెంటర్లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలోను, దక్షిణవీధి రామాలయం వద్ద, సత్యన్నారాయణపురం రామాలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలను సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవార్లకు విశేష పూజలు

దెందులూరు: దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపన్నపాలెం కనక దుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి గ్రామ మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు సునీత దంపతులకు భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న సమారాధన జరిగింది. ఏలూరు, దెందులూరు, పెదవేగి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ అన్న సమారాధనలో పాల్గొన్నారు. శ్రీ రామవరం గ్రామంలో దుర్గమ్మను ట్రాక్టర్ పై గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

గణపవరం: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రతేక అలంకరణలు చేశారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా ఆలయాల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిప్పుల గుండం, తెప్పోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గణపవరం వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. చినరామచంద్రపురం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం మహిళలు పెద్దసంఖ్యలో కుంకుమ పూజలు చేశారు.బాలయ్య చెర్వువద్ద ఉన్న కంచికామాక్షి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మండలంలని పలు గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.



గుండుగొలనులో రాజరాజేశ్వరి దేవిగా అలంకరణలో భక్తులకు దర్శనం



గణపవరంలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



రాజుపేట గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో కుంకుమ పూజలు



శ్రీరామవరంలో పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు



గణపవరంలో కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు



ఆలయ కమిటీ సభ్యులకు ఆశీర్వచనాలు ఇస్తున్న అర్చకులు

ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

దెందులూరు: ప్రతి మనిషి వ్యక్తిగతంగా కుటుంబ పరంగా సామాజికంగా మార్పు చెందాలని దెందులూరు ఎరుషలేము ప్రేయర్ మినిస్ట్రీస్ పాస్టర్ గ్రేస్ ర్యాలీ అన్నారు. దెందులూరు యాదవుల వీధిలో రైస్ మిల్ ఎదుట మూడు రోజుల ఉజ్జీవ ఉపవాస ప్రార్థనలో భాగంగా పాస్టర్ గ్రేస్ మాట్లాడుతూ దెందులూరు ఏలూరు, పెదవేగి మండలాల నుంచి వచ్చిన విశ్వాసులు మార్పునకు నిదర్శనమన్నారు. దేవుని ఆజ్ఞలు అనుగుణంగా జీవనవిధానం మార్చుకోవాలని ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కటి సాధ్యపడుతుందన్నారు. నిరంతర ప్రార్థన సేవాభావం, ఇరుగుపొరుగు వారిని ప్రేమతో చూడటం ఇతరులకు ఆదర్శంగా జీవించడం అలవర్చుకోవాలన్నారు. మూడు రోజులు పాటు వాక్య సందేశాన్ని అందించడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లను జెరూసలేం ప్రేయర్ మినిస్ట్రీస్ తరపున పాస్టర్ గ్రేస్‌రాని సంఘస్తులను ఘనంగా సత్కరించారు.